క్లుప్తంగా

ఆదివాసీలపై దాడులు అరికట్టాలి

కైలాస్‌నగర్: ఆదివాసీ గిరిజనులపై ఫారెస్ట్ అధికారుల దాడులను అరికట్టాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పూసం సచిన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నార్నూర్ మండలంలో కోవ లింబరావుపై దాడి చేసి గాయపరిచిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా

కైలాస్‌నగర్: భవన నిర్మాణరంగ కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆశన్న డిమాండ్ చేశారు. తెలంగాణ బిల్డింగ్, కన్స్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అసెంబ్లీ సాక్షిగా కార్మిక శాఖ మంత్రి కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరం వార్షికోత్సవం

బజార్‌హత్నూర్: మండలంలోని బజార్‌హత్నూర్ గ్రామంలో పూలాజీ బాబా ధ్యాన మందిరం 23వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీసద్గురు పూలాజీ బాబా పెద్ద కుమారుడు కేశవ్ ఇంగ్లే మాట్లాడుతూ.. సమాజంలో మానవ విలువలు పెరగాలంటే ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో ప్రయనించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య, ఎంపీపీ అజాడే జయశ్రీ, ప్రభుత్వ అధ్యాపకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బలరాం జాదవ్, బీజేపీ నాయకులు సాకటి దశరథ్, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, సర్పంచ్ పరచ లావణ్యసాయన్న పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి

జైనథ్: రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని ఆకోలిలో రామాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 30లక్షల నిధులతో రామాలయం నిర్మించనున్నట్లు తెలిపారు. కుల, మతాలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, వైస్ ఎంపీపీ సావా పూరే విజయ్‌కుమార్, తుమ్మల వెంకట్‌రెడ్డి, కుంచెట్టి కేశవ్, కోల భోజన్న పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

బజార్‌హత్నూర్: సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొట్టూరి ప్రవీణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని హర్కయి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఇద్దరు ఉపాధ్యాయులు గైర్హాజరు కావడంతో పాఠశాల మూసి ఉంది. దీంతో ఫోన్‌లో ఎంఈవో శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశారు.

చిరుధాన్యాలు సాగు చేయాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

సిరికొండ: చిరుధాన్యాలు సాగుతో అధిక దిగుబడులు వస్తాయని ఇన్‌చార్జి మండలాధికారి జాదవ్ కైలాష్ అన్నారు. మండలంలోని సోన్‌పెల్లి గ్రామంలో శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జాదవ్ కైలాష్ మాట్లాడుతూ.. చిరుధాన్యాలకు మార్కెట్లో మంచి ధర ఉంటుందని, రాగులు, సాములు, సజ్జలు తినడం వల్ల ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవీణ్, ఉప సర్పంచ్ జాకు, విలాస్, ఈశ్వర్, కిసాన్, సుధాకర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

తాంసి: మండలంలోని పొన్నారి సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు నివాసంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ప్రతిపక్ష పార్టీలకు రాబోయే రోజులలో మనుగడ ఉండదన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అరుణ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఉప సర్పంచ్ అండే అశోక్, లింగారెడ్డి, రాజన్న పాల్గొన్నారు.

పోలీస్ బెటాలియన్‌లో 'కంటివెలుగు'

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు 2వ బెటాలియన్ పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో కంటివెలుగు శిబిరం నిర్వహించారు. శుక్రవారం వైద్యులు పోలీస్‌సిబ్బందికి కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, అడిషనల్ కమాండెంట్ జయరాజు, అసిస్టెంట్ కమాండెంట్ నర్సింహరాజు, ప్రసాద్, కృష్ణ, వైద్యాధికారి శిల్ప, తదితరులు పాల్గొన్నారు.

గాలిలో గిరిజనుల ప్రాణాలు

- మండలంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు (ఫైల్)

సిరికొండ: సిరికొండ మండలంగా ఏర్పడి దాదాపు 7ఏళ్లు అవుతుంది. కానీ మండలంలో ఉన్న గిరిజనులకు అనారోగ్య సమస్యలు వస్తే పక్క మండలంలోని ఆరోగ్య కేంద్రాలకు, పరిస్థితి చేయిదాటితే.. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ ఇంత దారుణ పరిస్థితులు ఉన్నా.. ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయలేదు.

ప్రాణాలు పోణంగా..

మండలంలోని 19 గ్రామ పంచాయతీలు, 52 గ్రామాలు ఉన్నాయి. దాదాపుగా అన్ని ఏజెన్సీ గ్రామాలే. అధికంగా గొండులు, లంబాడాలు, కొలాంలు, మథుర వంటి జాతుల వారు ఉంటారు. గ్రామాల్లో పరిశుభ్ర పనులు, మౌలిక వసతులు అంతంతే. ప్రజలు అనారోగ్యం బారిన పడితే ఆసుపత్రికి తరలించేందుకు కూడా కనీసం రోడ్డు సౌకర్యం లేదు. గర్భిణుల కష్టాలు వర్ణణాతీతం. మండల కేంద్రంలో ఎలాంటి ప్రభుత్వ ఆసుపత్రి లేకపోవడంతో పక్క మండలాలు ఇంద్రవెల్లి, ఇచ్చోడకు వెళ్లాలి. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆసుపత్రి కోసం ఎదురుచూపులు..

మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత ఏడేళ్ల నుంచి ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మిస్తాదని ఎదురుచూస్తున్నారు. మండలంలోని తుమ్మల్‌పాడ్ గ్రామానికి చెందిన గర్భిణికి పురిటినొప్పులు రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేక 108కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది గ్రామానికి చేరుకొని ఆసుపత్రికి తీసుకెళ్లే లోపే బిడ్డకు జన్మనిచ్చింది. ఎలాంటి ప్రాణప్రాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇలా మండల వ్యాప్తంగా ప్రజలు, గర్భిణులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆసుపత్రి మంజూరు చేయాలి



మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఏదైనా అనారోగ్యానికి గురైతే పక్క మండలానికి వెళ్లాల్సి వస్తుంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి మండలానికి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం మంజూరు చేయాలి.

– పెందుర్ అమృత్‌రావు, ఎంపీపీ (సిరికొండ)

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



మండలంలోని అనేక గ్రామాల్లో నేను పర్యటించాను. దశలవారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. గిరిజన ప్రజలకు తప్పని సరిగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులో ఉండాలి. పీహెచ్‌సీ మంజూరు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.

– రేఖానాయక్, ఖానాపూర్ ఎమ్మెల్యే

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాపురావు

తలమడుగు: పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఉండమ్, సుంకిడి గ్రామాల్లో సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలోని ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. సుంకిడిలో త్వరలోనే మార్కెట్‌యార్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఖోడద్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మహేందర్ యాదవ్, ఆనంద్, పోచ్చుబాయి, అబ్దుల్లా, మండల కన్వీనర్ వెంకటేశ్, కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, పోచ్చన్న, సునీతరెడ్డి, వెంకన్నయాదవ్, చంటి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధికి కృషి

ఇచ్చోడ: దళితుల అభివృద్ధికి టీఆర్‌ఎస్ కృషి చేస్తుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని భాగ్యనగర్ కాలనీలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దళితులకు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. దళితబస్తీ, దళితబంధు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ మండల కన్వీనర్లు కృష్ణారెడ్డి, సర్పంచ్ చౌహాన్ సునీత, మండలాల కన్వీనర్లు బ్రహ్మానందం, కానిందే రాజారాం, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి


పథకం ప్రారంభిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం

ఆదిలాబాద్: క్విక్ డెలివరీ 99 పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కె.జానిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కార్గో బుకింగ్ సెంటర్‌లో క్విక్ డెలివరీ 99 పథకాన్ని ప్రారంభించారు. ఈపథకంలో భాగంగా రూ.99కే ఒక కేజీలోపు పార్శిల్‌ను గుర్తించిన 99 రూట్లలో మధ్యాహ్నం 12 గంటల్లోపు చేరవేయడం జరుగుతుందన్నారు. రాత్రి 9 గంటల్లోపు పార్శిల్ బుక్ చేసుకుంటే మధ్యాహ్నం 12 గంటల్లోపు చేరుకుంటుందన్నారు. వివరాలకు డీఎంఈ ఆదిలాబాద్ 91542 98531, ఆర్ ఎంఈ ఆదిలాబాద్ 91542 98552లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కల్పన, స్టేషన్ మేనేజర్ శకుంతల, ఆర్‌ఎంఈ ఎ.ప్రశాంత్ రెడ్డి, ఆర్సీవో సాయన్న, డీఎంఈ షేక్ అన్సార్ పాల్గొన్నారు.

కేస్లాపూర్‌లో మినీ స్టేడియం ఎక్కడ?


నాయకులను అడ్డుకున్న పోలీసులు

ఇంద్రవెల్లి: బీఆర్‌ఎస్ నాయకులు చెప్పుతున్న మినీ స్టేడియం ఎక్కడ ఉందని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం జెడ్పీటీసీ ఆర్క పుష్పలతతో పాటు మండల నాయకులు కేస్లాపూర్ నాగోబా జాతరను సందర్శించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మినీ స్టేడియం ఎక్కడ నిర్మించారో చూపించాలన్నారు. ఆసమయంలో రాష్ట్ర గిరిజన సహకార ఆర్థికాభివృద్ధి సంస్థ (ట్రైకర్) చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, జీసీసీ చైర్మన్ రమావత్ వాలియనాయక్‌లు నాగోబా ఆలయంలో పూజలు చేసి వెళ్తున్న క్రమంలో వినతిపత్రం అందించేందుకు వెళ్లారు. దీంతో పోలీసులు అడ్డుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం హయాంలో ప్రతిపక్షాలు ప్రశ్నించవద్ద అని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మడావి భీంరావ్, ఆర్క ఖమ్ము, ఆరెల్లి రాజలింగు, చిత్రం రాము, ముండే రాజేశ్వర్ పాల్గొన్నారు.

రేపు కార్యవర్గ సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు సొసైటీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, సుధాకర్‌లు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సొసైటీ భవనంలో సమావేశం అయ్యారు. జిల్లాలోని సొసైటీ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాగర్, ప్రభాకర్, ఎల్లయ్య, సంజీత, రవి, తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దు


భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో సురేశ్

నార్నూర్: భూసమస్యల పరిష్కారంలో జాప్యం చేయవద్దని ఆర్డీవో కదం సురేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. మండల కేంద్రానికి చెందిన జంగుబాయి అనే గిరిజన మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 103, 108 సర్వే నెంబర్‌లో ఉన్న భూములను పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ ధరణి ద్వారా భూ సమస్యలను పరిష్కరించడానికి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ దుర్వా లక్ష్మన్, డీటీ అమృత్‌లాల్, ఆర్ఐ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

గురుద్వార్‌ను సందర్శించిన ఎమ్మెల్యే


గురుద్వార్‌లో ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: సిక్కుల పవిత్ర గురుద్వార్‌ను ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న సందర్శించారు. ఫిబ్రవరిలో నాందేడ్‌లో బీఆర్‌ఎస్ మహాసభ జరగనున్న నేపథ్యంలో శుక్రవారం అక్కడికి వెళ్లారు. వారి ఆచారాలకు అనుగుణంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఆహ్వానించి సాంప్రదాయ పద్ధతిలో సన్మానించారు. మాజీ ఎంపీ గొడం నగేష్, తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. వేలాడుతున్న విద్యుత్ తీగలు



బేల: మండలంలోని చంపెల్లి ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాల ఎదుట విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. తక్కువ ఎత్తులో ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. సర్పంచ్ కొరంగే జంగ్‌షా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తీగలను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: సంతోష్, ఏఈ ట్రాన్స్‌కో, ఫోన్: 83339 23874

షరతులు లేకుండా రైతుబంధు ఇవ్వాలి


మాట్లాడుతున్న చారులత రాథోడ్

ఉట్నూర్‌రూరల్: ఎలాంటి షరతులు లేకుండా రైతు బంధు డబ్బులు అందించాలని జెడ్పీటీసీ చారులత రాథోడ్, ఏఐసీసీ ప్రోగ్రాం కమిటీ సభ్యుడు భరత్ చౌహాన్ కోరారు. శుక్రవారం మండలంలోని హస్నాపూర్ టీజీబీ బ్యాంకు ఎదుట రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మోసం అధికారంలోకి వచ్చాయని ఆరోపించారు. సీఎం కేసీఆర్ రైతులకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి విస్మరించారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు ఇక్బాల్, జావిద్, ప్రభాకర్, మధన్ రావు, జాదవ్ సునీల్, సేవాలాల్‌సేన జిల్లా కోఆర్డినేటర్, జాదవ్ సావిత్రి నాయక్, సర్పంచ్ జాదవ్ సునీల్, బాపురావు, జావిద్, వసంత్, సతీశ్, మహేందర్, వసంత్‌రావు ఇందల్ పాల్గొన్నారు.

పొదుపుతోనే భవిష్యత్‌కు బాటలు


అవగాహన కల్పిస్తున్న తపాలాశాఖ ఉద్యోగులు

నేరడిగొండ: తపాలాశాఖలో పొదుపు చేసి పిల్లల భవిష్యత్‌కు బాటలు వేయవచ్చని తపాలాశాఖ నిర్మల్ సబ్‌డివిజన్ ఎంవో మునీర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడ పిల్లల కోసం సుకన్య సమృద్ధి యోజన, ఆర్డీ, ఎస్బీ, గ్రామీణ తపాలా జీవితబీమాపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నిర్మల్ ఎస్‌డీఐపీ ఫసీ ఉద్దీన్, ఎస్పీఎం మహేష్ రెడ్డి, బీపీఎంలు రాజు, గంగాధర్, సరిక, శ్యామిలి, ముర్తూజా, వెంకటేష్, అనిల్, కార్తీక్, నారాయణ, అంజయ్య పాల్గొన్నారు.

మావల నాయబ్ తహసీల్దార్‌గా ప్రవీణ్‌కుమార్

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల నాయబ్ తహసీల్దార్‌గా పి.ప్రవీణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన సుజాతను డీఎస్‌వో కార్యాలయానికి బదిలీ చేయగా.. ఆమె స్థానంలో ఆదిలాబాద్ అర్బన్ నాయబ్ తహసీల్దార్‌గా ప్రవీణ్‌కుమార్‌ను నియమించారు. ఆయనకు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ఆదిలాబాద్ అర్బన్ నాయబ్ తహసీల్దార్‌గా మహేష్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ అర్బన్ మండల నాయబ్ తహసీల్దార్‌గా బూస మహేష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన ప్రవీణ్ కుమార్ మావల మండలానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో డీఎస్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న మహేష్‌ను నియమించారు.

బీఆర్‌ఎస్ సంబురాలు

ఇంద్రవెల్లి: నాగోబా ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 12 కోట్ల, 50లక్షల మంజూరు చేసినట్లు జీవో విడుదల చేయడంతో శుక్రవారం మండల కేంద్రంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె నివాసం వద్ద బీఆర్‌ఎస్ నా యకులు సంబురాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీప శోభాబాయి, మహ్మద్ అంజద్, కోవ రాజేశ్వర్, కుమ్రం జంగుబాయి, కనుక తుకారం, దేవ్‌పూజే మారుతి, రాంచందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పాఠశాల అభివృద్ధికి విరాళం

తాంసి: భీంపూర్ మండలం అంతర్గాం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి సర్పంచ్ బక్కి లలిత రెండు నెలల జీతం రూ.10 వేలు విరాళం ఇచ్చారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఖాదర్‌కు అందజేశారు. వీరితో పాటు పాఠశాల పూర్వ విద్యార్థి గజానన్ రూ.1000, హెచ్‌ఎం శ్రీకాంత్ రూ. 3వేలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కపిల్, గజానన్, స్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన జాగృతి అధ్యక్షుడు

కైలాస్‌నగర్: తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను జాగృతి జిల్లా అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్‌రావు శుక్రవారం కలిశారు. హైదరాబాదులోని ఆమె నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు రావాల్సిందిగా ఆమెను ఆహ్వానించినట్లు శ్రీనివాస్‌రావు తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

ఉట్నూర్: కొన్ని గంటల్లో పెళ్లి అనగా.. గుండె పోటుతో మృతి చెందిన రావుల సత్యనారాయణ చారి కుటుంబానికి సేవాలాల్ సేన తరుపున అండగా ఉంటామని జిల్లా కోఆర్డినేటర్ జాదవ్ సావిత్రి నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బాధిత కుటుంబసభ్యులను ఆమె పరామర్శించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కైలాస్‌నగర్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 2023 క్యాలెండర్‌ను శుక్రవారం టూ టౌన్ సీఐ పురుషోత్తం చారి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గేడం కేశవ్, ఉపాధ్యక్షుడు మెస్రం ప్రవీణ్, సహాయ కార్యదర్శి మడావి గణేష్, బాదల్, దేవేందర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి


ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఆదిలాబాద్‌టౌన్: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం రూరల్ సీడీపీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ మాట్లాడుతూ. గత 40 ఏళ్లుగా పేదలకు సేవలు అందిస్తున్న అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. పింఛన్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు ప్రమీళ, అడెల్ల, పద్మ, మధునిక, సునీత పాల్గొన్నారు.


నార్నూర్: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నార్నూర్, గాదిగూడ మండలానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు మండల కేంద్రంలోని సీడీపీవో కార్యాలయం ముందు శుక్రవారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ.. కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. ప్రగతిభవన్ సాక్షిగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నేరవేర్చాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్‌ను నష్టం కలిగించే నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంగన్న, జాదవ్ సుభద్ర అంగన్‌వాడీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు, పంచశీల జిల్లా ఉపాధ్యక్షురాలు, మల్లు సంగీత, కళ, సుమిత్ర, సుజాత, లీలాబాయి పాల్గొన్నారు.

ఉట్నూర్: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని అంగన్‌వాడీ యునియన్ జిల్లా నాయకురాలు సునీత అన్నారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా.. ప్రభుత్వం ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. లేబర్ కోడ్స్ రద్దు చేసి, ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలన్నారు. హెల్త్ కార్డులు, వేతనంతో కూడిన మెడికల్ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రత్నమాల, ముక్తా, స్వర్ణలత, సుభద్ర, పద్మ, సంగీత పాల్గొన్నారు.

నాడు జలకళ



నేడు వెలవెల



రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతంగా పేరొందిన కుంటాల జలపాతం బోసిపోయి కళాహీనంగా మారింది. గతేడాది ఇదే సమయంలో జలసవ్వడులతో సందడిగా ఉండేది. జలపాతాన్ని చూసేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చేవారు. ప్రస్తుతం నీరు లేక బండరాళ్లు దర్శనమిస్తున్నాయి.

– నేరడిగొండ